క్లుప్తంగా

తుమ్మిళ్ల నీళ్లు విడుదల చేయాలి

మానవపాడు: మిరప పంట పూత, కాయ దశలో ఉందని నీళ్లులేక ఎండిపోయే పరిస్థితి ఉందని తుమ్మిళ్ల నీళ్లు విడుదల చేయాలని సోమవారం మండల కేంద్రంలోని డీ- 30 కాలువ వద్ద నిరసన తెలిపారు. మిరప పంటను మండల రైతులు ప్రధానంగా సాగు చేస్తున్నట్లు, పూత, కాయలు, ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల శివారు రైతుల పంట పొలాలకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, బాషా తదితరులు పాల్గొన్నారు.

మాదిగ కళామండలి కమిటీ ఎన్నిక



అయిజ: మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో సోమవారం మాదిగ కళా మండలి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అభిరాం, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, ప్రచార కార్యదర్శిగా రత్నం, సహాయ కార్యదర్శిగా రాజారత్నం, కోశాధికారిగా సుందర్ రాజు, గౌరవ అధ్యక్షులుగా మహేష్, నాగరాజు, ఆంజనేయులు, హనుమంతును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భీమన్న, వెంకటన్న, మోషన్న, నాగరాజు, హనుమంత్, ఆంజనేయులు, అభిరామ్, వెంకటేష్, ప్రభుదాస్, చంటన్న, మహేష్, సుందర్ రాజు, ఆనందం, రాజారత్నం, భీమన్న, దేవదాస్, పక్కీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ మారుతీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లెదుదిన్నెకు చెందిన తిమ్మారెడ్డి ఎంఈఓ నరసింహ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత తిమ్మారెడ్డిని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి.. కేసు నమోదు

మల్దకల్ : మండలంలోని మద్దెలబండ గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై సోమవారం మల్దకల్ పోలీసులు దాడులు నిర్వహించారు. వివరాలు.. మద్దెలబండ గ్రామ సమీపంలో కానిగల వాగులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడిలో రూ. 23,500 నగదు, 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు అదే విధంగా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం గోవిందస్వాముల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల దీక్ష ముగించుకున్న గోవింద స్వాములకు ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో ఇరుముడులు కట్టారు. అనంతరం స్వాములంతా కలిసి వేంకటేశ్వరస్వామి దర్శనార్థం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



ఎర్రవల్లి: అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ సోమవారం తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని తిమ్మాపురం గట్టు నుంచి ఆదివారం అర్ధరాత్రి టీఎస్33 టీ3382 నంబర్ గల టిప్పర్‌లో ఎర్రవల్లి కూడలికి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బ్లూకోర్ట్స్ సిబ్బంది యాక్తాపురం స్టేజీ సమీపంలో టిప్పర్‌ను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. టిప్పర్ యజమాని రాముడు, డ్రైవర్ రాజేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పంచాయతీలో పాలన కరువు



చిన్న ఆముదాలపాడులో పేరుకుపోయిన చెత్త(ఫైల్)

- ఐదు నెలలుగా కార్మికులకు అందని జీతాలు
- నిధులు లేవంటున్న అధికారులు
- ఆర్థిక ఇబ్బందుల్లో జీపీ కార్మికులు

ఉండవెల్లి : పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలక వర్గాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం వాటా నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు కూడా గత ఆరు నెలలుగా రావడం లేదు. దీంతో పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. చెత్త తీసుకెళ్లడానికి ఉపయోగించే ట్రాక్టర్‌కు డీజిల్ కూడా కరువైంది. గత ఐదు నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాలు అందడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేక కార్యదర్శులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఒకరిద్దరు కార్యదర్శులు తమ సొంత ఖర్చులతో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు.

16 గ్రామ పంచాయతీలు..

మండలంలో మొత్తం 16 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీ సామర్థ్యాన్ని బట్టి ఒక్కో పంచాయతీలో 5 నుంచి 12 మంది వరకు మల్టీపర్పస్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ గుమస్తాలతో పాటు, నీటి సరఫరా చేసేందుకు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, విద్యుత్ దీపాల నిర్వహణ తదితర విధులు నిర్వహిస్తున్నారు.

మొదలు పెట్టని పన్నుల వసూళ్లు..

పంచాయతీల్లో ఇంటి పన్ను తదితర పన్నులు వసూలు చేసి వేతనాలు, ఇతర అవసరాలకు వాడుకునే వెసులుబాటు ఉన్నా పంచాయతీ గుమస్తాలు ఇంతవరకు పన్నులు వసూలు మొదలు పెట్టలేదు. కొన్ని మేజర్ పంచాయతీల్లో గుమస్తాలు తమకున్న రాజకీయ అండదండలతో పని చేయకుండా ఇతరులపై పనిభారం వేసి బాధ్యతలు విస్మరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కార్యదర్శులు కొత్తగా బాధ్యతలు స్వీకరించడంతో పంచాయతీలపై పట్టు లేకపోవడంతో వారు కూడా పన్ను వసూలు చేపట్టడం లేదు.

సీనియర్ గుమస్తాల అజమాయిషీ..

మండలంలో సీనియర్ గుమస్తాలు పంచాయతీ కార్యదర్శులను సైతం బెదిరింపులకు గురిచేసి పనులు చేయకుండా తప్పించుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చాం మనకెందుకులే అన్నట్లుగా కార్యదర్శులు కూడా మిన్నకుంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వేతనాలకు నిధులు మంజూరు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. చెల్లించని పక్షంలో సమ్మె చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు.

గ్రామంలో కార్మికులే లేరు..

సర్పంచ్‌లు ఉన్న సమయంలో కార్మికులను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం కార్మికులు బంద్ చేశారు. దీంతో గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే ఉంది. కార్యదర్శులు ఎవరో కూడా గ్రామ ప్రజలకు తెలియదు. ఎవరో వస్తున్నారు..పోతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు అధికంగా ఉన్నాయి.

– నరసింహులు, చిన్న ఆముదాలపాడు

తక్షణమే మంజూరు చేయాలి..

మండలంలో పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు రావడం లేదు. పంప్ ఆపరేటర్లు, పారిశుద్ధ్య కార్మికులు శ్రమించి పని చేస్తున్నాం. జీతా విషయమై అధికారులకు అడిగితే నిధులు మంజూరు కావడం లేదంటున్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

– పరుశరాముడు, కార్మికుడు,

సబ్ స్టేషన్లు మంజూరు చేయాలి

అలంపూర్ : లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం సబ్ స్టేషన్లు మంజూరు చేయాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్ రెడ్డికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో డైరెక్టర్‌ను ఎమ్మెల్యే సోమవారం కలిశారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి మండలంలో లోఓల్టేజి సమస్య ఉందని, 132/33 కేవీ సబ్ స్టేషన్లు మంజూరు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అశోక్ రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు, నాయకులు

ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

గద్వాల: రాష్ట్ర క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న అర్హులైన క్రైస్తవ మైనార్టీ మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్ బాబు ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 20వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోచ్చవని తెలిపారు. పూర్తి వివరాలకు 70130 32567 నంబర్ సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లి : మండల పరిధిలోని యాక్తాపురం గ్రామానికి చెందిన బుడ్డ నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు సోమవారం నర్సింహులు భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, నర్సింహారెడ్డి, రాజు, యువరాజు, బీచుపల్లి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



అయిజ: మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అయిజ పట్టణంలోని సమస్యలతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శేక్షావలి ఆచారి, మధు కుమార్, కృష్ణారెడ్డి, సాంబశివుడు, వీరేశాచారి పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ సింధు ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి, బ్లడ్ శాంపిళ్లను గద్వాల్‌కు పంపించినట్లు తెలిపారు. అనంతరం పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్య, తిరుమాల్‌రావు, కృష్ణవేణి, అనసూయమ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓలు

గట్టు : బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని తహసీల్దార్ సరితారాణి కోరారు. సోమవారం ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ, వద్దు మాకు పెళ్లి.. బడికే పోతాం మేం అనే పోస్టర్లను తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ రవి, ఎంఈఓ నల్లారెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సరితారాణి మాట్లాడుతూ.. గ్రామాల్లో బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా అందరూ కలసి అడ్డుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి వీరేష్ సాగర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల నుంచి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరోజ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. జ్టి ఇ//టీఠీ్ౌ ఇ్టటట.ఛిజజ.జౌఠి.జీ‌ు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా జిల్లాలోని ఎస్సీ విద్యార్థులకు సంబంధించి దరఖాస్తు ఫారాన్ని నమోదు చేయడానికి ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రైవేటు కాలేజీ యాజమాన్యం తమ డిజిటల్ కీ కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈడీఎం సెక్షన్‌లో సంప్రదించాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

గద్వాల: ప్రథం ఫాండేషన్ ఆధ్వర్యంలో 18-30సంవత్సరాల వయసు గల యువతి, యువకులకు 30రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి డాక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, ఇంటర్, డిగ్రీ, ఎలక్ట్రీషియన్ అర్హత కలిగి శిక్షణ పూర్తి చేసిన వారికి ఎన్ఎస్‌డీసీ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8న ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఎంప్లాయిమెంట్ అధికారి ఆధ్వర్యంలో జూమ్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు 63034 30789, 90304 21360 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

గద్వాలటౌన్: వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలుపర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ అనంతరం పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. ఓరుగల్లు వేదికగా టీపీసీసీ హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకంతో ఎకరాకు రూ. 15వేలు అందిస్తామని రైతు డిక్లరేషన్ ద్వారా గొప్పలు చెప్పారని విమర్శించారు. ఇప్పుడు రూ. 12 వేలకు కుదిస్తూ నిర్ణయం తీసుకొని అన్నదాతలను వంచించారని మండిపడ్డారు. రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వరిధాన్యానికి బోనస్ మాట బోగస్ అయిందని.. కేవలం 30 శాతం రైతులకే చెల్లించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో తొలిదఫా రైతుభరోసా కింద రూ. 2,500 తక్కువ ఇచ్చారని, వానాకాలం ఎగ్గొట్టిన రూ. 7,500తో కలిపితే రూ. 10వేలు ఇప్పటికే రైతులకు ప్రభుత్వం బకాయి పడిందని ఆరోపించారు. ఈ యాసంగి పంటకు ఇవ్వాల్సిన రూ. 7,500 కలిపి.. మొత్తంగా ఎకరానికి రూ. 17,500 చొప్పున రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేష్, బస్వరాజు, శేఖర్ నాయుడు, శ్రీరాములు, తిరుమలేష్, రాజు, గట్టు రాము, మునిమౌర్య, మాజీ, వెంకటేష్ నాయుడు, సామేలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

మల్దకల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు వీరేష్ గౌడ్, సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇస్తానని హామీ ఇచ్చి నేడు మాట మార్చి ఎకరాకు రూ.12వేలు ఇవ్వడం ఏంటని వారు ప్రశ్నించారు. ఎకరాకు రూ.15వేలను తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ద్రోహి కాంగ్రెస్..

కేటీదొడ్డి : మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతునాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలోని గద్వాల-రాయచూర్ రోడ్డుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. రుణమాఫీ, రైతుభరోసా ఇచ్చేవరకు పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, రవి, కృష్ణ, నక్కరవి, ప్రహ్లాద్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి..

ధరూరు : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం..

గట్టు : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన మాట తప్పి రైతులను మోసం చేసిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.




మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

సోమవారం గట్టు బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ నేత బల్గెర హనుమంతునాయుడు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు అంగడి బస్వరాజు, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

అయిజ: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, మత్తాలి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

రాజోళి : వరదల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ రామ్మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. 2009లో సంభవించిన తుంగభద్ర వరదల్లో రాజోళి గ్రామం మొత్తం ముంపునకు గురై సర్వం కోల్పోయిందన్నారు. అప్పట్లో దాతలు, ప్రభుత్వం చాలా మందికి ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. 7 మంది నిరాశ్రయుల ఇళ్లు మాత్రం మధ్యలో ఆపేశారన్నారు. కొందరికి స్థలాలు మాత్రమే ఇచ్చారని వారందరు గుడిసెలు వేసుకుని కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిపారు. వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి విజయకుమార్ తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు తిప్పన్న, కేవీపీఎస్ నాయకులు ఆనందం, తిమ్మప్ప, దేవరాజు, శీలన్న, సోలోమాన్, సీఐటీయూ మండల నాయకులు లక్ష్మన్న, కృష్ణ, మంజునాథం పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

అయిజ: క్రీడాకారులు ప్రతినిత్యం సాధన చేసి ఉత్తమ ప్రతిభ కనబర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ నాల్గవ రోజు క్రీడలకు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిలు భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

భక్తి మార్గంలో నడుచుకోవాలి

మల్దకల్ : ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి బింగిదొడ్డి కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ సూచించారు. సోమవారం మండలంలోని విఠలాపురం గ్రామంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. భగవద్గీత సమాజంలోని కులమతాలు, అసమానతలు రూపుమాపడానికి, దైవ భక్తిని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రంగప్ప, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, నరసింహ, శివ, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మ, అనంతమ్మ, సుభద్రమ్మ, దీపిక, జ్యోతి, సుజాత తదితరులు తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

చెన్నిపాడు రోడ్డుకు మరమ్మతు

మానవపాడు: రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, ఏళ్లుగా పరిస్థితులు మారడం లేదని చెన్నిపాడు ప్రజలు వాపోతున్నట్లు జనవరి 1న 'సాక్షి' దినపత్రికలో ఈ రోడ్ల దుస్థితి మారదా? అనే కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో చెన్నిపాడు నుంచి మానవపాడుకు వెళ్లే రోడ్డుకు దాదాపు రూ. 5లక్షలతో మరమ్మతులు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ రాజేశ్వరి తెలిపారు. చెన్నిపాడు మీదుగా పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు రోడ్డుకు మరమ్మతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



రోడ్డుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

నాణ్యమైన భోజనం అందించాలి

గట్టు : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ నల్లారెడ్డి కోరారు. సోమవారం ఎంఈఓ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల సందర్శించారు. వంట గది పరిశీలించి ఆహార పదార్థాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగది, పాత్రలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. క్రమ శిక్షణతో చదువుకుని మంచి మార్కులు సాధించాలని సూచించారు.



పాఠశాలలో స్టోర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ నల్లారెడ్డి

శివపార్వతుల విగ్రహాల వితరణ

శాంతినగర్ : వడ్డేపల్లి మండలం రామాపురంలో వెలసిన శ్రీ అభయరామలింగేశ్వరస్వామి ఆలయానికి తిరుపతికి చెందిన ఓ భక్తుడు శివపార్వతుల పంచలోహ ఉత్సవ విగ్రహాలు వితరణ గావించారు. తిరుపతికి చెందిన యచ్చం సురేష్ బాబు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి (యూఎస్ఏ) గతంలో ఇచ్చిన హామీ మేరకు తల్లిదండ్రులైన స్వర్గీయ యచ్చం రామమూర్తి, గోవిందమ్మల జ్ఞాపకార్థం ఆలయ కమిటీ నిర్వాహకులు దామోదర్ రెడ్డి, గజేందర్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి, లక్ష్మిరెడ్డిలకు ఆదివారం తిరుపతిలో విగ్రహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు దాత సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



దాత సురేష్ కుటుంబసభ్యులతో ఆలయ కమిటీ సభ్యులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
గద్వాల - బి. బస్వరాజు - 9666283739
అలంపూర్/అయిజ - ఎస్.నాగార్జున్ రెడ్డి - 91828 20045
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
జబ్బార్ లాల్ : 9553955603